# చిన్న వాడు

దేవుని పరిశుద్ధ నామమునకు మహిమ కలుగును గాక!

**మూలవాక్యం:** ఆది 21:12 అయితే దేవుడు **ఈ చిన్నవాని బట్టియు** నీ దాసిని బట్టియు నీవు దుఃఖపడవద్దు. శారా నీతో చెప్పు ప్రతి విషయములో ఆమె మాట వినుము; ఇస్సాకు వలన అయినదియే నీ సంతానమనబడును.

ప్రభువైన క్రీస్తు మనకు మోషేనో, యోబునో, మరేవర్నో మాదిరిగా చూపలేదు కాని ఒక చిన్న వానిని మాదిరిగా చూపించి అలా మనం మారకపోతే మనం పరలోకరాజ్యానికి వెళ్లలేము అని చెప్పారు. కాబట్టి చిన్న బిడ్డల గురించి మనం చాలా ధ్యానించవలసి ఉన్నది. చిన్న బిడ్డ 5 రొట్టెలు, 2 చేపలు ప్రభువు చేతికి ఇవ్వకపోయి ఉంటే అంత గొప్ప అద్భుతం జరిగి ఉండేది కాదు గదా. ఆ దాతృత్వం కలిగిన బిడ్డను కని, పెంచిన తల్లిదండ్రులు ధన్యులు. చిన్నవారి పట్ల మన బాధ్యతలేంటో వాక్యంలో చూచి నేర్చుకుందాం!

i. **చిన్నవారిని మందిరములో ప్రతిష్టించాలి:** 1 సమూయేలు 1:24,28 పాలు మాన్పించిన తరువాత **అతడు(సమూయేలు) ఇంక చిన్నవాడై యుండగా ఆమె ఆ బాలుని ఎత్తికొని మూడు కోడెలను తూమెడు పిండిని ద్రాక్షారసపు తిత్తిని తీసికొని షిలోహులోని మందిరమునకు వచ్చెను.** కాబట్టి **నేను ఆ బిడ్డను యెహోవాకు ప్రతిష్ఠించుచున్నాను**; తాను బ్రదుకు దినములన్నిటను వాడు యెహోవాకు ప్రతిష్ఠితుడని చెప్పెను. అప్పుడు వాడు యెహోవాకు అక్కడనే మ్రొక్కెను.

ii. 1. ఎనిమిదవ రోజునే ప్రతిష్టించాలి. 2. సున్నతి చేయాలి. 3. పేరు పెట్టాలి.

లూకా 1:59 (యోహాను) **ఎనిమిదవ దినమున వారు ఆ శిశువుకు సున్నతి చేయవచ్చి** తండ్రి పేరును బట్టి జెకర్యా అను పేరు వానికి పెట్టబోవుచుండగా

**ఎందుకు 8 వ రోజునే సున్నతి చేయాలి? 8వ రోజు సున్నతి చేస్తే భవిష్యత్తులో cancer రాకుండా ఉంటుంది. 8 వ రోజునే రక్తంలో ప్లేట్లెట్లు తయారవుతాయి.**

లూకా 2:21 (యేసు క్రీస్తు) **ఆ శిశువునకు సున్నతి చేయవలసిన యెనిమిదవ దినము వచ్చినప్పుడు**, గర్భమందాయన పడక మునుపు దేవదూత చేత పెట్టబడిన యేసు అను పేరు వారు ఆయనకు పెట్టిరి.

**మీరు ప్రతిష్టించబడ్డారా. మరి ఏ రోజునా ! ఎనిమిదవ దినమునా ? లేక మీ తల్లిదండ్రులకు ఇష్టం వచ్చిన రోజునా? లేక బంధువులకు అందరికి కుదిరే పబ్లిక్ హాలి డే రోజునా?**

**సమూయేలు 8వ దినమున మందిరములో ప్రతిష్ట చేయబడలేదు. ఎందుకంటే హన్నా అక్కడ ఒక తీర్మానం తీసుకునింది. అది దేవునికి అంగీకార యోగ్యంగా ఉండింది. అది ఏంటంటే 1సమూయేలు 1:22 అయితే హన్నా బిడ్డ పాలు విడుచువరకు నేను రాను; వాడు(కుమారుడైన సమూయేలు)యెహోవా సన్నిధిని అగుపడి తిరిగి రాక అక్కడనే ఉండునట్లుగా నేను వాని తీసికొనివత్తునని తన పెనిమిటితో చెప్పి వెళ్లక యుండెను.**

1 సమూయేలు 1:3 లో కాబట్టి ఆమె పెనిమిటియైన ఎల్కానా నీ దృష్టికి ఏది మంచిదో అది చేయుము; నీవు వానికి పాలు మాన్పించు వరకు నిలిచియుండుము. **యెహోవా తన వాక్యమును స్థిరపరచును గాక అని ఆమెతో అనెను.**
భర్త ఆ మాట ఎలా అన్నారు. ఎలా ఒప్పుకున్నారు. ఇదే రహస్యం. జరుగుతున్నది సమస్తం దేవుని ప్రణాళిక అని భార్యాభర్తలు ఇరువురు కనుగొని ప్రార్థన ద్వారా అలాంటి నిర్ణయాలు తీసుకున్నారు.

iii. **చిన్నవారి కొరకు ప్రార్థించాలి:** 1రాజులు 17:21 **ఆ చిన్నవాని మీద ముమ్మారు తాను పారచాచుకొని, యెహోవా నా దేవా, నా మొఱ్ఱ ఆలకించి యీ చిన్నవానికి ప్రాణము మరల రానిమ్మని యెహోవాకు ప్రార్థింపగా**




మీ కోసం మీ పిల్లల కోసం ఏడ్వండి అని క్రీస్తు తన్ను వెంబడిస్తున్న స్త్రీలతో చెప్పినప్పుడు ఏడ్చి ప్రార్థన చేయమని అని గుర్తు చేసుకోవాలి. తల్లి కన్నీరు బిడ్డలను పరిశుద్ధులుగా మార్చుతుంది. సిలువ సైనికులుగా మారుస్తుంది. మీ కన్నీటి చుక్కలు ప్రార్థనలో అగ్ని గోళాలుగా మారి సాతానుడిని కొట్టి మీ బిడ్డలను విడిపిస్తాయి. అందుకే రోదించు స్త్రీల వలె ప్రతి క్రైస్తవ స్త్రీ మారాలి.

iv. **చిన్నవారికి ఆతిథ్యం చేయాలి:** మత్తయి 10:42 మరియు శిష్యుడని యెవడు ఈ చిన్నవారిలో ఒకనికి గిన్నెడు చన్నీళ్లు మాత్రము త్రాగనిచ్చునో వాడు తన ఫలము పోగొట్టుకొనడని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను.

శిష్యుడు అనగా చిన్నబిడ్డ వలె మారువాడు అని అర్థం చేసుకోవాలి.

చిన్న వాని 5 రొట్టెలు 2 చేపలు 7000 మంది ఆకలి తీర్చింది. ఆలోచించండి 7000 మంది తిండిని గూర్చిన జాగ్రత్త లేని వారే, కాని ముందు జాగ్రత్త కలిగిన తల్లి, ఆ చిన్న వాని దాతృత్వమే ఆ అద్భుతానికి కారణం.

v. **చిన్నవారికి ఉపవాసం నేర్పించాలి:**

యోవేలు 2:15,16 సీయోనులో బాకా ఊదుడి, ఉపవాసదినము ప్రతిష్ఠించుడి, వ్రతదినము నియమించి ప్రకటనచేయుడి. జనులను సమకూర్చుడి, సమాజ కూటము ప్రతిష్ఠించుడి, పెద్దలను పిలువనంపించుడి, **చిన్నవారిని స్తన్యపానము చేయు బిడ్డలను తోడుకొని రండి;** పెండ్లికుమారుడు అంతఃపురములో నుండియు పెండ్లి కుమార్తె గదిలోనుండియు రావలయును.

మీ బిడ్డలకు తినడం నేర్పించారు. మరి ఉపవాసం నేర్పించారా? ఉపవాసం ఖచ్చితంగా నేర్పించాలి. ఇప్పుడు చాలా మంది జ్ఞానులు క్రైస్తవులను "అన్యులలాగా ఉపవాసం చేస్తున్నారు" అని విమర్శిస్తున్నారు. అయ్యలారా ! మొదట మీరు వాక్యాన్ని బాగా చదవండి. అర్థం చేసుకొనే జ్ఞానం, నడిపింపు కోసం పరిశుద్ధాత్మ దేవునిని అడగండి. ప్రపంచానికి అన్ని నేర్పింది మనం. ఈ రోజు వారితో పోల్చుకోవడం ఏంటి ?

**చిన్న పిల్లలకు ఉపవాసం ఎందుకనగా?**

i. **దేవుడు ఆ చిన్నవారి మొరను వింటాడు:**

ఆది 21:17 **దేవుడు ఆ చిన్నవాని మొరను వినెను.** అప్పుడు దేవుని దూత ఆకాశమునుండి హాగరును పిలిచి హాగరూ నీకేమివచ్చినది? భయపడకుము; **ఆ చిన్నవాడున్న చోట దేవుడు వాని స్వరము విని యున్నాడు.**

ii. **దేవుడు ఆ చిన్నవారికి తోడైయుంటాడు:**

ఆది 21:20 **దేవుడు ఆ చిన్నవానికి తోడైయుండెను.** అతడు పెరిగి పెద్దవాడై ఆ అరణ్యములో కాపురముండి విలుకాడాయెను.

iii. **చిన్నవారి మీద యెహోవా హస్తము ఉంచుతాడు:**

జెకర్యా 13:7 ఖడ్గమా, నా గొఱ్ఱెల కాపరి మీదను నా సహకారి మీదను పడుము; ఇదే సైన్యములకధిపతియగు యెహోవా వాక్కు. గొఱ్ఱెలు చెదరిపోవునట్లు కాపరిని హతము చేయుము, **చిన్నవారి మీద నేను నా(యెహోవా) హస్తమునుంచుదును; ఇదే యెహోవా వాక్కు.**

**చిన్న వారి పట్ల చేయకూడనివి:**

1. **చిన్నవాని మీద చెయ్యి వేయకూడదు: దేవుడు అబ్రహాముతో ఇస్సాకు పైన కత్తి వేయవద్దని చెప్పిన మాట:**

ఆదికాండము 22:12 అప్పుడు **ఆయన (యెహోవా) ఆ చిన్నవాని మీద చెయ్యి వేయకుము;** అతని నేమియు చేయకుము; నీకు ఒక్కడైయున్న నీ కుమారుని నాకియ్య వెనుతీయ లేదు గనుక నీవు దేవునికి భయపడువాడవని యిందువలన నాకు కనబడుచున్నదనెను.




కొంత మంది విశ్వాసులు పిల్లలను చేటతో, చీపురు కర్రతో, చెప్పుతో కొడుతుంటారు. వాక్యం బెత్తమునకు మాత్రమే అనుమతి ఇచ్చింది. ఇలా కనబడిన ప్రతి దానితో కొట్టకూడదు.

యెహోవా వలన దేవుడు బహుమానముగా, ఆస్తిగా, సూచనలుగా, ఆశీర్వాదంగా ఇచ్చిన పిల్లలను కొడితే తీర్పు నీ కోసం ఎదురు చూస్తుంది. అలా చేసి ఉంటే దేవుని దగ్గర క్షమాపణ అడగండి. మీ పిల్లలను కూడా క్షమాపణ అడగండి. మరెన్నడు అలా చేయకండే.

2. చిన్నవాని యెడల పాపము చేయకూడదు: యాకోబు కుమారుడైన రూబేను, మిగతా సహోదరులు యోసేపును చంపతలచినప్పుడు పలికిన మాట:

ఆది 42:22 మరియు రూబేను ఈ చిన్నవాని యెడల పాపము చేయకుడని నేను మీతో చెప్పలేదా? అయినను మీరు వినరైతిరి గనుక అతని రక్తాపరాధము మన మీద మోపబడుచున్నదని వారి కుత్తరమిచ్చెను.

యోసేపు పట్ల స్వంత అన్నదమ్ములు అసూయ కలిగి ఉన్నారు. ఒకనాడు వారి క్షేమ సమాచారము కనుక్కోవడానికి తండ్రి యోసేపును వారి వద్దకు పంపిస్తే ఇదిగో కలలు కనేవాడు వస్తున్నాడు. అని దేవుడు తనకు ఇచ్చిన వరమును బట్టి ఎగతాళి చేస్తూ, యోసేపుని పట్టుకొని, యోసేపుకు తండ్రి కుట్టించిన విచిత్ర వస్త్రమును బలవంతముగా లాగుకొని గుంటలో త్రోసివేసి, చంపాలనుకున్నారు. కాని రూబేను ఈ చిన్న వాని ఎడల ఆ పాపము చేయకండి అన్నందుకు దారిన వెళ్లే ఇష్మాయేలీయులకు 20 వెండి నాణెములకు అమ్మి వేశారు.

యేసు ప్రభువును కూడా రాబోయే రోజుల్లో స్వంత శిష్యుడే అమ్మివేస్తారు అనేందుకు ఇదో సూచన.

3. చిన్న వారిని అభ్యంతరపరచకూడదు: ప్రభువైన క్రీస్తు శిష్యులకు చెప్పిన జాగ్రత్త:

మత్తయి 18:6 నాయందు విశ్వాసముంచు ఈ చిన్న వారిలో ఒకనిని అభ్యంతరపరచువాడెవడో, వాడు మెడకు పెద్ద తిరుగటిరాయి కట్టబడినవాడై మిక్కిలి లోతైన సముద్రములో ముంచి వేయబడుట వానికి మేలు.

ఈ మధ్య కాలంలో ఈ మాటను వాడుకొని యేసు క్రీస్తును ఒక సైకో, శాడిస్ట్ అని చిత్రీకరించడానికి మతోన్మాదులు ప్రయత్నిస్తున్నారు. రాబోయే తీర్పు ముందు ఇలాంటి ఒక చిన్న punishment మేలే అని ప్రభువు అన్నారు. అంతేకాని ఆ విధంగా చంపండి అని అనలేదు. ఇలా తప్పుడు అర్థాలు పుట్టిస్తున్న మతోన్మాదులు మారడం కోసం సత్యం తెలుసుకోవడం కోసం మాత్రమే మనం ప్రార్థిద్దాం.

ఆ రోజు యేసు క్రీస్తు తన శిష్యులను హెచ్చరిస్తే, ఈ రోజు ఆ మాట మతోన్మాదులకు చెప్పినట్లు ఎగిరి పడుతున్నారు. చిన్న బిడ్డలను ఇబ్బంది పెట్టకూడదు అనేది కామన్ సెన్స్. అది చిన్నపిల్లల హక్కు కూడా. చిన్నపిల్లలకు హక్కులు కల్పించిన దేవుడు, ఆ హక్కులను మనం ఉల్లంఘిస్తే ఏం శిక్ష వేస్తారో కూడా అందరికీ తెలుసు. అలాంటి శిక్ష మన పైకి తెచ్చుకోకుండా జాగ్రత్తపడదాం. ఆమేన్.....ఆమేన్......ఆమెన్ !

4. చిన్నవారిని తృణీకరించ కూడదు: ప్రభువైన క్రీస్తు శిష్యులకు చెప్పిన హెచ్చరిక.

మత్తయి 18:10 ఈ చిన్నవారిలో ఒకనినైనను తృణీకరింపకుండ చూచుకొనుడి. వీరి దూతలు, పరలోకమందున్న నా తండ్రి ముఖమును ఎల్లప్పుడు పరలోకమందు చూచుచుందురని మీతో చెప్పుచున్నాను.

చిన్న బిడ్డలను ప్రేమించిన యేసు క్రీస్తు, వాళ్లని అంగీకరించమని, వారిని తృణీకరించ వద్దని మనకు హితవు నేర్పించారు. అన్యదేవతలైతే పిల్లల రక్తం కోరుకుంటే క్రీస్తు మాత్రం మనందరి కోసం రక్తం కార్చి అందరినీ ప్రేమించడం మనకు నేర్పించారు. ఎంత తేడా. ఇందును బట్టి దేవుడెవరో, దెయ్యమెవరో తెలుసుకోవాలి.




**ముగింపు :**

ఇంతకు చిన్న వారు ఎవరు ? ఒకటి శారీరకంగా చిన్నవారు లేక చిన్న బిడ్డలు. యేసు క్రీస్తు తన వద్దకు చిన్నపిల్లలను ఆశీర్వాదించడానికై తీసుకు వచ్చిన తల్లిదండ్రులను శిష్యులు ఆటంకపరచడం చూచి వారిని సున్నితంగా గద్దించారు. చిన్న పిల్లలను నా యొద్దకు రానియ్యుడి. ఇలాంటి వారిదే పరలోకరాజ్యం అన్నారు. అందుకే చిన్న బిడ్డలను చిన్న నాట నుండే మందిరానికే అంటుకట్టాలి. మందిరంలో పెంచాలి. క్రమాలు నేర్పించాలి.

రెండవదిగా ప్రభువును అంగీకరించిన ప్రతి అన్యుడు, ప్రతి నూతన విశ్వాసి చిన్న బిడ్డే. వారిని ప్రేమతో అక్కున చేర్చుకోవాలి. వారి స్థితిని అర్థం చేసుకొని వారి ప్రతి బలహీనతలోను మనం బలంగా ఉండాలి. మన దాతృత్వముతో వారిని బలపరచాలి. ప్రేమతో వాక్యం, సంఘ క్రమం నేర్పించాలి. రాజకీయాలు నేర్పకూడదు. ఇతరుల గురించి వారికి చెడు మాటలు చెప్పకూడదు.

నయమాను ఇంట్లో చిన్నది, బాలుడైన సమూయేలు, ప్రభువు చేతికి 5 రొట్టెలు, 2 చేపలు అందించిన చిన్నవాడు, ప్రభువును చూచి స్తుతిస్తూ కేకలు వేసిన చిన్న పిల్లలు (మత్తయి 21:15 కాగా ప్రధానయాజకులును శాస్తులును ఆయన చేసిన వింతలను, దావీదు కుమారునికి జయము అని దేవాలయములో కేకలు వేయుచున్న చిన్నపిల్లలను చూచి కోపముతో మండిపడి), పేతురు స్వరాన్ని గుర్తు పట్టిన చిన్నది రోదే మనకు ఆదర్శం. మన బిడ్డలు కూడా విశ్వాస వీరులుగా ఎదగాలంటే మందిరమే మంచి చోటు. అది కూడా లెంట్ లో. అలా చేయడానికి పరిశుద్ధాత్మ దేవుడు మనకు సహాయం చేయున గాక!